# సాక్షి
## విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 16 । సెప్టెంబర్ । 2026






### మొక్కలు నాటిన చైర్‌పర్సన్

చిలకలపూడి(మచిలీపట్నం): స్థానిక జెడ్పీ ఆవరణలో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మంగళవారం మొక్కలు నాటారు. జెడ్పీ సీఈఓ అరుణ, డెప్యూటీ సీఈఓ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



### పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుత నిల్వ 27.6413 టీఎంసీలు. ప్రాజెక్టు దిగువకు 400 క్యూసెక్కులు లీకేజీల ద్వారా వెళుతోంది.



### గవర్నర్‌కు జ్ఞాపిక అందజేత

మచిలీపట్నంటౌన్: గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీం బెగ్ మంగళవారం జ్ఞాపిక అందజేశారు. గవర్నర్ గతంలో బందరు వచ్చినప్పుడు దిగిన ఫొటో అందించారు.

## న్యూస్‌రీల్

### విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి



**కోనేరుసెంటర్(మచిలీపట్నం):** భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని కృష్ణా విశ్వవిద్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.రాంజీ కేకు కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య అనేక రంగాల్లో విశేషంగా రాణించారని కొనియాడారు. కర్ణాటక రాష్ట్రం బెల్గాంలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ ఆయన పేరిట స్థాపించారని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఎన్.ఉష మాట్లాడుతూ.. దేశానికే తలమానికమైన వ్యవసాయ, సాగునీటి రంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. కృష్ణా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.కె.సుందరకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య ఆర్.కిరణ్‌కుమార్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం.బాబురెడ్డి, డాక్టర్ ఆర్.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

### సత్తాచాటిన కృష్ణాజిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్



**మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):** పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఈ నెల 12, 13 తేదీల్లో జరిగిన 44వ అంతర్ జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కృష్ణాజిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సత్తాచాటి 70 పతకాలను సొంతం చేసుకున్నారు. వివిధ క్రీడాంశాలు, పలు విభాగాల్లో 21 స్వర్ణ, 30 రజత, 19 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. తమ్ము కస్తూరి బాయి, కె.గీతాంజలి, వలివర్తి నాగమణి, సోమ శేఖర్, కె.ఉమామహేశ్వరి, పి.రామకృష్ణ, పి. జ్యోతిప్రకాశ్, కోటేశ్వరరావు, ఎం.అరుణ, ఎన్. కుముదవతి, ఎస్.పురుషోత్తం స్వర్ణ పతకాలు సాధించారు. తోట యర్రన్న, ఎస్కే మహబూబ్ సుభానీ, టి.జమాల్ బాబు, పి.విజయ సువర్ణ రాజు, పి.మహేష్ బాబు, అప్పారి శివదుర్గా ప్రసాదరావు, వి.నాగేంద్రరావు, యు.లక్ష్మీ నారాయణ, ఎల్. నెల్సన్, గోరిపర్తి వెంకట విజయకుమారి, సుంకర మాధవి, కె.జయ కృష్ణ రజత, కాంస్య పతకాలు పొందిన వారిలో ఉన్నారు. పతకాలు పొందిన మాస్టర్స్ క్రీడాకారులను కృష్ణాజిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.జ్యోతి ప్రకాశ్, కార్యదర్శి ఎ. శివ గణేష్ బాబు అభినందించారు.


### రేపు విశ్వకర్మ జయంతి



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 17వ తేదీన విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. విశ్వకర్మ జయంతి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి విశ్వబ్రాహ్మణులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షులు కర్రి వేణుమాధవ్, దనాలకోట వాసు, ఎన్టీఆర్ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పి.సాయికిరణ్, జిల్లా అధికార ప్రతినిధి తుంపాల వరప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కెల్లా శివ, విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం సెక్రటరీ వెంకటేశ్వరరావు, జవ్వాది కూర్మాచారి పాల్గొన్నారు.

### 18న జిల్లా స్థాయి సైన్స్ సెమినార్

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయి జాతీయ సైన్స్ సెమినార్ జరుగుతుందని జిల్లా సైన్స్ అధికారి కె.పిచ్చేశ్వరరావు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభచాటిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 16న పాఠశాల స్థాయి, 17న మండల స్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు. మండల విద్యాశాఖ అధికారులు మండల స్థాయి పోటీలు నిర్వహించి ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించాలని సూచించారు. సీవీఆర్ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా స్థాయి పోటీలు, సెమినార్ జరుగుతాని వెల్లడించారు. 'ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2027 : ప్రాస్పెక్ట్స్ అండ్ చాలెంజెస్' అంశంపై సెమినార్ ఉంటుందని తెలిపారు.



గంగిరెద్దు డూడూ బసవన్నల కొండపల్లి బొమ్మ

- కొండపల్లి బొమ్మల పరిశ్రమకు 400 ఏళ్ల ఘన చరిత్ర
- నైపుణ్యంతో కళాత్మకంగా కొయ్య బొమ్మల తయారీ
- తెల్లపొనికి కలప కొరతతో కళాకారులకు ఇబ్బందులు
- బొమ్మల పరిశ్రమపై ఆధారపడిన 150 కుటుంబాలు



గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా కొండపల్లి బొమ్మ



కొండపల్లి బొమ్మల శిక్షణ కేంద్రంలో బొమ్మలు చేస్తున్న మహిళా కళాకారులు

●కొండపల్లి బొమ్మ

# తరతరాల అపురూప జ్ఞాపిక

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** కొండపల్లి బొమ్మలు తరతరాల సాంస్కృతిక వారసత్వం, కళా నైపుణ్యానికి ప్రతీకగా నిలిచాయి. దేశానికి వన్నె తెచ్చిన ఎన్నో ప్రాచీన కళలు అంతరించినా 400 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ కొయ్యి బొమ్మలకు హస్తకళాకారులు నేటికీ జీవంపోస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో కూడిన ఈ బొమ్మలు వాస్తవిక దృక్పథాన్ని కలిగిస్తాయి. వివిధ రకాల పండ్ల తొక్కలు, ఆకులతో తయారు చేసే సహజ సిద్ధ రంగులతో ఈ బొమ్మలు సరికొత్త శోభను సంతరించుకుంటున్నాయి. బొమ్మల పరిశ్రమలో కళాకారుల నైపుణ్యం, తయారీ మెటీరియల్, ముడి సరుకు, తదితర అవసరాలకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కొంతమేర సహకారం అందిస్తున్నాయి. ఏటా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో సుమారు రూ.2.50 కోట్ల మేర బొమ్మల వ్యాపారం జరుగుతోంది.



104 వాహన వైద్యసేవలు బొమ్మ

**బొమ్మల చారిత్రక నేపథ్యం**

14వ శతాబ్దంలో కొండపల్లి కోట నిర్మాణానికి పునాది పడింది. 16వ శతాబ్దంలో నిర్మించిన రాజ భవనాలకు నగిషీలు అద్దేందుకు రాజస్థాన్ రాష్ట్రం నుంచి వచ్చిన రాజవంశీకులు కొండపల్లి బొమ్మల పరిశ్రమకు ప్రాణం పోశారు. బ్రిటీష్ పాలనలో రాజస్థాన్ నుంచి వచ్చిన వారు బొమ్మల తయారీ పరిశ్రమను తమ జీవనోపాధిగా చేసుకున్నారు. కొండపల్లి అడవుల్లో లభించే తేలికపాటి తెల్లపొనికి చెక్కతో ఆకర్షణీయమైన బొమ్మలను కళాత్మకంగా తయారు చేసేవారు. రాజస్థాన్ కళాకారుల వద్ద పనిచేసిన స్థానికులు సైతం బొమ్మల తయారీలో నైపుణ్యం సాధించారు. అనతి కాలంలో బొమ్మల తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం 150 కుటుంబాలు బొమ్మల పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.

**నైపుణ్యంతో కళాత్మక బొమ్మలు**

కొండపల్లి కొయ్యి బొమ్మలను హిందూ పురాణాలు, గ్రామీణ నేపథ్యం, జానపద కళల నుంచి ప్రేరణ పొంది తయారు చేస్తారు. దశావతారాలు, సీతారామలక్ష్మణులు, ఏనుగు అంబారీ, విష్ణు మూర్తి, బ్రహ్మదేవుడు, పల్లకిలో పెళ్లికొడుకు, ఎడ్లబండితో రైతు, తలలు ఊపే బొమ్మలతో పాటు మార్కెట్‌లో ఆదరణ కలిగిన అంశాలను ఎంచుకుని బొమ్మలు తయారు చేస్తారు. అడవుల్లో లభించే తేలికగా ఉండే తెల్లపొనికి చెక్కతో ఎంచుకున్న ఆకృతితో బొమ్మలు చెక్కి వాటికి చింతగింజల పొడి, రంపపు పొట్టు పేస్ట్‌తో అతికించి సున్నం పూసి ఎండబెడతారు. ఆకర్షణీయంగా రంగులు అద్ది విక్రయాలకు సిద్ధం చేస్తారు. కొండపల్లి బొమ్మలకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ గుర్తింపు లభించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రపంచ వారసత్వ సంపద దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు కొండపల్లి బొమ్మల వేడుకలు నిర్వహించారు.

**తెల్లపొనికి కలప కొరత**

బొమ్మల తయారీలో ఉపయోగించే తెల్లపొనికి చెట్లు కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో అంతరించాయి. శతాబ్దాలుగా బొమ్మల తయారీలో వినియోగించడం వల్ల చెట్లు తరిగి పోయాయి. దీంతో బొమ్మల తయారీకి చేతివృత్తిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అటవీశాఖ అధికారులు తెల్లపొనికి మొక్కలు పెంచి అడవిలో నాటుతున్నప్పటికి జంతుజాలం సంచారంతో అవి నశిస్తున్నాయి. పొరుగు మండలాలు తిరువూరు, ఎ.కొండూరు ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలతో తెల్లపొనికి కలప తెచ్చుకోవల్సి వస్తోంది. కొంతమంది మార్కెట్‌లో లభించే న్యూఉడ్, కొన్ని రకాలు టేకు కలపతో బొమ్మలను తయారు చేయడం ప్రారంభించారు.

**అక్కరకు రాని ఉడ్ బ్యాంక్ సేవలు**

బొమ్మల పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఎన్టీఆర్ కలెక్టర్ జి.లక్ష్మీశ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, బొమ్మల ఉత్సవాలు నిర్వహించి ప్రోత్సాహం అందిస్తున్నారు. తెల్లపొనికి కలప కొరత విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర పర్యాటక, పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో కొండపల్లిలో ఉడ్ బ్యాంక్ ఏర్పాటు చేయించారు. అయితే తెల్లపొనికి బదులు బూరుగు, పనస, నల్లమద్ది కలప పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఆ రకాల కలప తమకు వద్దని, బొమ్మల తయారీకి పనికిరాదని కళాకారులు తేల్చి చెప్పారు.


**ముందు ముందు గడ్డుకాలం**

400 ఏళ్లకు పైగా అనేక ఒడిదొడుకులతో నెట్టుకొచ్చిన కొండపల్లి బొమ్మల పరిశ్రమ భవిష్యత్తు గడ్డుకాలం ఎదురుకానుంది. గతంలో 250 కుటుంబాల వరకు బొమ్మల పరిశ్రమపై ఆధారపడి జీవించేవి. ప్రస్తుతం 150 కుటుంబాలు మాత్రమే బొమ్మలు తయారు చేస్తున్నాయి. ఇటీవల కలప పంపిణీలో అధికారులు చేపట్టిన సర్వేలో 80 కుటుంబాలు మాత్రమే పూర్తిగా బొమ్మల పరిశ్రమలో ఉన్నట్లు తేల్చారు. ప్రస్తుత తరం తమ బిడ్డలను చదివించి ఉద్యోగస్తులుగా చూడాలని ఆశపడటం, తెల్లపొనికి చెట్లు అంతరించడం, కూలీల కొరత, మార్కెటింగ్‌లో పోటీతత్వంతో అనేక మందిలో బొమ్మల తయారీ పరిశ్రమపై ఆసక్తి సన్నగిల్లుతోంది. కళాకారులను ప్రోత్సహించి బొమ్మల పరిశ్రమ అంతరించకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



టేకు చెక్కతో తయారు చేసిన ఎడ్ల బండి

**సహజ సిద్ధ రంగులతో ఆదరణ**



దేశంలో ఎన్నో వారసత్వ కళలు అంతరిస్తున్నప్పటికీ కొండపల్లి బొమ్మలకు ఆదరణ ఉంది. ఈ బొమ్మలు ఆకర్షణీయంగా ఉండాలంటే సహజ సిద్ధ రంగులు వాడాలి. గ్రామీణ వాతావరణం, కుటుంబ నేపథ్యాలతో గతంలో సుమారు 80 రకాల బొమ్మలు తయారు చేసేవారు. ప్రస్తుతం వాటి సంఖ్య పూర్తిగా తగ్గించారు. ఇటీవల అడవిలో దొరికే ఆకులు, కూరగాయలతో సహజ సిద్ధ రంగుల తయారీలో బొమ్మల కళాకారులకు శిక్షణ ఇచ్చాను. కొంతమందే పాటిస్తున్నారు. దుకాణాలు లేని వారికి ట్రైనింగ్ సెంటర్‌లో దుకాణాలు ఇస్తే బాగుంటుంది.

– రమేష్ రామనాథం, హస్తకళల డిజైనర్

# ముంచెత్తుతున్న ప్లాస్టిక్

- ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్న కాలువలు, డ్రెయిన్లు
- విజయవాడలో రోజురోజుకు పెరుగుతున్న వ్యర్థాల ఉత్పత్తి
- పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలు శూన్యమంటున్న నిపుణులు



ఏలూరు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** కాలుష్యం విజయవాడ నగరాన్ని కబళిస్తోంది. వాహనాల నుంచి వస్తున్న ఉద్గారాలతోపాటు రోజూ ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు నగరాన్ని ముంచెత్తుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు చేపట్టకపోవటం వల్లే కాలుష్య తీవ్రత నానాటికీ ఉధృతమవుతోందని నివేదికలు చెబుతున్నాయి.

**రోజుకు 600 టన్నుల చెత్త ఉత్పత్తి**

విజయవాడలో రోజూ ఉత్పత్తయ్యే చెత్తకు సంబంధించి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నివేదికలు పలు అంశాలను స్పష్టం చేస్తున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో నిత్యం 550 నుంచి 600 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఇందులో 50 నుంచి 53 శాతం తడి లేదా బయోడీగ్రేడబుల్, 43 నుంచి 46 శాతం పొడి లేదా నాన్-బయోడీగ్రేడబుల్ వ్యర్థాలని అంచనా. దేశీయ ప్రమాదకర శానిటరీ వ్యర్థాలు 0.2 శాతం, పూల వ్యర్థాలు 0.4 శాతంగా ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

**ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆందోళన**

నగరంలో ఉత్పత్తియ్యే చెత్తలో 20 శాతం ప్లాస్టిక్ ఉంటున్నాయి. నిత్యం 78 నుంచి 80 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. ఇందులో ప్లాస్టిక్ ప్యాకింగ్ వ్యర్థాలు 60 టన్నులు. సింగిల్ యూజ్ వ్యర్థాలు 20 శాతం, మిగిలినవి వివిధ రూపాల్లో వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలని అంచనా. ఇవన్నీ కాలుష్యాన్ని ప్రభావితం చేసేవే. వీటిని నిర్మూలించటం, తరలించటం వంటి అంశాల్లోనూ కాలుష్యం ఉత్పత్తవుతోంది. నగరంలోని కాలువల్లో కలుస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా ఏలూరు కాలువ, బందరు కాలువ, రైవస్ కాలువతో పాటుగా బుడమేరు కాలువలు నగరం మీదుగా ప్రవహిస్తున్నాయి. ఈ కాలువల ద్వారా భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు తరలుతున్నాయి. వాటి వల్ల పర్యావరణం తీవ్రంగా ప్రభావితం అవుతోందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో, డ్రెయిన్లలో వేయటం తగదని సూచిస్తున్నారు.

**నిషేధాలు ఉన్నా ఫలితం సున్నా**

నిషేధాలు, తనిఖీలు, జరిమానాలు ఉన్నప్పటికీ నిత్యం 80 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తుండటం గమనార్హం. దీనిని బట్టి ఉన్న నిషేధాలు ఉన్నా అమలుకావడంలేదన్న వాస్తం అవగతం అవుతోంది. నగరంలో వివిధ రకాల ప్లాస్టిక్ ప్యాకింగ్ వస్తువుల విక్రయాలు భారీగా జరుగుతున్నాయి. డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు, పాలిథిన్ కవర్లు, పలు రకాల గృహోపకరణాలు వంటి వస్తువులను సైతం భారీగానే విక్రయిస్తున్నారు. అయితే ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణ విషయంలో ఎక్కడా అధికారులు చిత్తశుద్ధిగా వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపించడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలపై సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైతం ఆందోళన వ్యక్తం చేసినట్లుగా నివేదికలు వివరిస్తున్నాయి.

**నిబంధనలు అమలు చేయాలి**

కాలుష్య నివారణకు ప్రభుత్వం నిర్దేశిస్తున్న నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించటం, నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై నిఘా పెంచటం, కాలం చెల్లిన వాహనాల నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు విస్తృత చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని పర్యావరణ వేత్తలు గుర్తు చేస్తున్నారు. నగరంలో రోజురోజుకు దిగజారుతున్న పర్యావరణం ఓజోన్ పొరపై ప్రభావం చూపుతోందని, తత్ఫలితంగా సూర్యుడి నుంచి వచ్చే కిరణాలు జీవరాశిపై పడటం వలన అనేక దుష్ఫలితాలు చోటు చేసుకుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**గాలిలో కాలుష్య తీవ్రతపై ఆందోళన**

గాలిలో కాలుష్య తీవ్రతపైన నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సుల ప్రయాణం, ఇతర వాహనాల నుంచి వచ్చే పొగ, ఉద్గారాలు పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మరో వైపు విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను తగులబెట్టడం వల్ల డయాక్సిన్లు, ఫ్యూరాన్లు వంటి ప్రమాదకరమైన విషవాయువులు విడుదలై గాలి కలుషితమవుతోంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్దేశించిన ప్రమాణాలు వరుసగా ఐదు సంవత్సరాలు దాటితే ఆ నగరాన్ని నాన్-ఎటైనిమెంట్ సిటీగా పేర్కొంటారు. ఆ జాబితాలో విజయవాడ ఉన్నట్లుగా నిపుణులు వివరిస్తున్నారు.

**ఏక దంతాయ.. వక్రతుండాయ..**

వినాయక చవితి పండుగను ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. వాడవాడలా మండపాల్లో బొజ్జగణపయ్యను ప్రతిష్ఠించి నవరాత్రులను ప్రారంభించారు. పందిళ్లలో కొలువుదీరిన వినాయక ప్రతిమలు వివిధ ఆకారాల్లో కనువిందు చేశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



విజయవాడ ఆటోనగర్ తంగెళ్లమూడి వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


## కళ్లకు గంతలతో కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

**మచిలీపట్నంఅర్బన్:** వైద్య, ఆరోగ్యశాఖలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్ట్ ఉద్యోగులు సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బి.సౌమ్యరేఖ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ ఎంహెచ్ సీజేఏసీ) ఆధ్వర్యంలో న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రాష్ట్రవ్యాప్త శాంతియుత పోరాటంలో భాగంగా మంగళవారం మచిలీపట్నంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద కాంట్రాక్టు ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నల్ల బెలూన్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సౌమ్య రేఖ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 30 రోజుల శాంతియుత కార్యాచరణలో భాగంగా విధుల బహిష్కరణను తాత్కాలికంగా వాయిదా వేసి తొలి దశ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి సంఘీభావం తెలిపారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి.దయాకర్‌కు కాంట్రాక్టు ఉద్యోగులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

## ఓటు హక్కు పరిరక్షణకు ఐక్య కార్యాచరణ




ప్రసంగిస్తున్న మల్లాది విష్ణు

**సాక్షి, అమరావతి:** ప్రజాస్వామ్యంలో ఎంతో ముఖ్యమైన ఓటు హక్కు పరిరక్షణ కోసం ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్లాల్సిన అవసరం వచ్చిందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియపై విజయవాడలోని దాసరి భవన్‌లో మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మి తదితరులు ప్రసంగిస్తూ... ఓట్లు తొలగించే ప్రయత్నాలను అడ్డుకోకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 44 లక్షల ఓట్లు గల్లంతైన అంశంపై ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో 42 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇవ్వడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రతి ఓటరూ తన ఓటుహక్కు కోసం పదేపదే తాను అర్హుడినని నిరూపించుకోవాల్సిన దుస్థితి రావడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కాంగ్రెస్ నాయకులు మస్తాన్‌వలి, కొలనుకొండ శివాజీ, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## యూట్యూబర్ నందన సైలెంట్ విజిట్

**ఇబ్రహీంపట్నం:** ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు రెన్యూవల్ చేయిస్తామని నమ్మబలికి నిరుద్యోగులను మోసం చేసిన కేసులో యూట్యూబర్, నందూస్ వరల్డ్ చానల్ నిర్వాహకురాలు రమా నందన మంగళవారం గుట్టుచప్పుడు కాకుండా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసుల ఎదుట విచారణకు హాజరైంది. వీసా స్కామ్‌లో ఈ నెల ఎనిమిదో తేదీన ఆమె విచారణకు హాజరైన సమయంలో ఈ నెల 16న మరో సారి విచారణకు హాజరు కావాలని పోలీసులు ఆదేశించారు. దీంతో ఆమె ఒకరోజు ముంగానే వచ్చి వెళ్లిపోయింది. ఏపీలోని వివిధ జిల్లాలకు చెందిన బాధితులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన బాధితులు ఇబ్రహీంపట్నం వచ్చేందుకు సిద్ధమవడంతో ఒకరోజు ముందుగానే ఆమె హాజరైనట్లు తెలుస్తోంది. మీడియా, బాధితుల కంట పడకుండా పోలీసులు ఆమెకు సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




కీ॥శే॥ ముక్కు శ్రీరామిరెడ్డి గారు
మరణం: 16-09-1998

**28వ వర్ధంతి**

మీరు మమ్ములను వీడి స్వర్గస్తులై 28 సంవత్సరాలు గడిచిననూ మీ స్మృతులను మరువలేకున్నాము. మీ ఆశయ సాధనకై నిరంతరము శ్రమిస్తూ.. ముందుకు నడుస్తామని, మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ....

ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి మరియు నిర్మల్ శిశుభవన్‌నందు అన్నదానము నిర్వహించబడును

ముక్కు వెంకటేశ్వరరెడ్డి బ్రదర్స్
సెల్: 99858 27608

అన్నపురెడ్డి సుబ్బారెడ్డి
చైర్మన్ : కొండవీడు అకాడమి, విజయవాడ

RR & SR ENTERPRISES / SRIRAM CONSTRUCTIONS -VJA

## క్లుప్తంగా

### డబ్ల్యూపీఎల్ టీజర్ విడుదల

**మొగల్రాజపురం (విజయవాడ తూర్పు):** మంగళగిరి క్రికెట్ స్టేడియంలో ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న ఉమెన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టీజర్‌ను ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్మన్ రాయపాటి శైలజ మంగళవారం ఆమె చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా క్రికెట్ ప్రతిభను వెలికితీసేందుకు డబ్ల్యూపీఎల్ గొప్ప వేదిక అన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ కల్యాణ్ కృష్ణ, ఏసీఏ సీఈవో జై కిషన్ ఆమెను కలిసి డబ్ల్యూపీఎల్ నిర్వహణ గురించి వివరించారు.

### గాంధీ జయంతి రోజున నిరసన దీక్ష

**గన్నవరం:** విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించకపోతే అక్టోబర్ 2న ఆందోళనకు దిగుతామని ప్రజా సంఘాల నేతలు స్పష్టం చేశారు. స్థానిక చింతపల్లి పాపారావు స్మారక భవనంలో మంగళవారం విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విమానాశ్రయ విస్తరణ కోసం దళితుల ఇళ్లు, స్థలాలు తీసుకున్న ప్రభుత్వం పుష్కర కాలమైన హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 427 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి వందల కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వం ఇక్కడి నిర్వాసితులకు రూ. 30కోట్లు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ప్రజా సంఘాల నేతలు టీవీ లక్ష్మణస్వామి, ఎం. ఆంజనేయులు, కాట్రగడ్డ రామచంద్రజోషి, అభినాష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### పుల్లేరులో స్నానానికి దిగిన వ్యక్తి మృతి

**ఉయ్యూరు:** పుల్లేరులో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉయ్యూరు పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తోట్లవల్లూరు రోడ్డులో పుల్లేరు పక్కన రోడ్డు వెంబడి నివాసం ఉంటున్న ఈగా శ్రీను (28) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం కాలువలో స్నానానికి దిగి నీటి ఉద్ధృతికి మునిగిపోయాడు. స్థానికులు గాలింపు చేపట్టి శ్రీను మృతదేహాన్ని వెలికితీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


### రిమాండ్ పొడిగింపు

**విజయవాడలీగల్:** అక్రమ మద్యం కేసులో ఏ9 నిందితుడు తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి రిమాండ్ మంగళవారం ముగిసింది. దీంతో గుంటూరు జైలు నుంచి పోలీసులు వర్చువల్‌గా ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి ఎల్.తేజోవతి ఈనెల 29వ తేదీ వరకు రిమాండ్ విధించారు.

# ఎయిడెడ్‌కు సర్దు‘పోటు’!

- ఉమ్మడి జిల్లాలో 44 మంది మిగులు ఉన్నారంటూ నోటీసులు
- 16న బందరు డీఈవో కార్యాలయానికి రావాలని పిలుపు
- యాజమాన్యాలకు సమాచారం లేకుండానే ఉత్తర్వులు?
- పారదర్శకంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయుల్లో టెన్షన్



**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల సిబ్బంది సర్దుబాటు వ్యవహారం పలు ప్రశ్నలను లేవనెత్తుతోందని ఉపాధ్యాయులు, ఎయిడెడ్ యాజమాన్యాలు విమర్శిస్తున్నాయి. ఒక పాఠశాలను మూసివేస్తే అక్కడి సిబ్బందిని ఎక్కడ సర్దుబాటు చేయాలి? విద్యార్థులు లేని పాఠశాలలకు పోస్టులు ఏ ప్రాతిపదికన మంజూరు చేయాలి? మిగులు సిబ్బందిని గుర్తించే విధానం ఏమిటి? సంబంధిత యాజమాన్యాలకు ముందుగా సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదా? వంటి అనేక ప్రశ్నలను ఉపాధ్యాయులు సంధిస్తున్నారు.

**ఏం జరిగిందంటే..**

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన మొత్తం 44 మందిని మిగులుగా విద్యాశాఖ గుర్తించింది. వీరందరినీ 16వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలంటూ మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లాలోనూ లేనటువంటి ప్రక్రియ ఇప్పుడు ఇక్కడ ఎందుకు ప్రారంభించారో అర్థం కావటంలేదంటూ ఉపాధ్యాయ సంఘ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

**నిర్ణయం ఎలా?**

జిల్లాలో శారదా విద్యాలయం మూసివేసి సుమారు ఆరు నెలలు గడిచినప్పటికీ.. అక్కడ పనిచేసిన ఎనిమిది మంది ఉద్యోగులు నగరపాలక సంస్థ పాఠశాలల్లో డెప్యూటేషన్‌పై కొనసాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికీ వారి జీతాలు మాతృసంస్థ నుంచే చెల్లుబాటు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎయిడెడ్ పాఠశాలల సిబ్బందిని ఎయిడెడ్ పాఠశాలల్లోనే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఉంటే.. ఈ ఎనిమిది మందిని మునిసిపల్ పాఠశాలలకు పంపడానికి అనుసరించిన విధానం ఏమిటి? ఎవరి అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నారు? అన్నది తేలాల్సి ఉందని నేతలు ప్రశ్నిస్తున్నారు.

**విద్యార్థులు లేరు.. పోస్టులు వచ్చాయి!**

నగర పాతబస్తీలో ఓ పాఠశాలకు ఈ ఏడాది కొత్తగా ఎనిమిది పోస్టులు మంజూరు చేశారు. అయితే విద్యార్థుల సంఖ్యే లేని ఆ పాఠశాలకు ఇన్ని పోస్టులు ఎందుకు అవసరమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. పోస్టులు మంజూరు చేసే ముందు వాస్తవ విద్యార్థుల సంఖ్యను పరిశీలించకపోవటం ఏమిటంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పుడు అదే ఎనిమిది పోస్టుల్లో నాలుగింటిని మరో పాఠశాలకు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

**ప్రతిపాదనలపై అనుమానాలు..**

అసలు పోస్టుల మంజూరుకు సంబంధించిన ప్రతిపాదనలు ఎవరు పంపారు? ఏ నివేదిక ఆధారంగా ఆమోదించారో చెప్పాలంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ఎవరు ధ్రువీకరించారు? అనే అంశాలపై సమగ్ర విచారణ అవసరమని పలువురు కోరుతున్నారు.

**మిగులు పేరుతో టార్గెట్?**

వివిధ ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా ఉన్న సిబ్బందిని బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇప్పటికే మూసివేసిన పాఠశాలకు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులు మునిసిపల్ పాఠశాలల్లో కొనసాగుతుండగా.. ఇతర ఎయిడెడ్ పాఠశాలల్లోని సిబ్బందిని మాత్రమే సర్దుబాటు చేయడంలో ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అందరికీ ఒకే నిబంధనా ఉండాలి కదా అని పలువురు ఉపాధ్యాయులు వ్యాఖ్యానిస్తున్నారు.

**పారదర్శకంగా కొనసాగాలి.**

ఎయిడెడ్ విద్యాసంస్థల్లో మిగులు సిబ్బందిని తరలించాలంటే నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వ్యవహరించాలని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. పారదర్శకంగా ఏమి చేసినా ఫర్వాలేదని, కానీ అనేక అనుమానాలకు తావిచ్చే విధంగా చర్యలు చేపడితే విద్యావ్యవస్థపై ప్రభావం చూపుతుందంటూ వారు వ్యాఖ్యానిస్తున్నారు.

**సమాచారం ఇవ్వలేదు..**

ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలకు సమాచారం ఇవ్వకుండా, ఆయా పాఠశాలల్లో వాస్తవంగా మిగులు పోస్టులు ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించకుండానే నేరుగా ఉత్తర్వులు జారీ చేయడం పట్ల పలు యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, భవిష్యత్ ప్రవేశాలు, బోధనా అవసరాలు, సిబ్బంది నిష్పత్తి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం కాగితాలపై ఉన్న లెక్కల ఆధారంగా సిబ్బందిని తరలిస్తే విద్యా వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని ఎయిడెడ్ విద్యాసంస్థల నేతలు చెబుతున్నారు.

పోస్టుల మంజూరు, సిబ్బంది సర్దుబాటు, డెప్యూటేషన్ల వంటి అంశాల్లో ఆర్థిక ప్రయోజనాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలు సైతం కొన్ని వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో ఈ ప్రక్రియపై రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించాల్సిందేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

**నిబంధనల ప్రకారమే చర్యలు..**



ఎయిడెడ్ పాఠశాలల రద్దు, విద్యార్థులు లేని విద్యాసంస్థల నుంచి సిబ్బందిని మిగులుగా గుర్తించి వేరే పాఠశాలలకు పంపించేందుకు చర్యలు చేపట్టాం. రద్దయిన విద్యాసంస్థల సిబ్బంది వ్యవహారంలో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం సిబ్బంది వివరాలను విద్యాశాఖకు పంపించాం. తదుపరి నిర్ణయాలు ఉన్నతాధికారుల ఆదేశానుసారం తీసుకుంటాం. అలాగే ఎయిడెడ్ యాజమాన్యాలకు మిగులు సిబ్బంది ఉత్తర్వులు పంపించాం. వారి నుంచే ఉపాధ్యాయులకు చేరుతాయి.

– యూవీ సుబ్బారావు, డీఈవో, కృష్ణాజిల్లా

### భార్యతో గొడవ..
## భర్త బలవన్మరణం

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** భార్యాభర్తల మధ్య మనస్పర్థల నేపథ్యంలో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. వాగు సెంటర్‌లోని ఆల నాగయ్య వీధిలో కర్రి అరుణ్‌కుమార్(40), ప్రియాంక దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం, అరుణ్‌కుమార్ మార్కెట్‌లో బంగారపు పని చేస్తుంటాడు. అరుణ్ కుమార్ సరిగా పనికి వెళ్లకుండా భార్యను అనుమానిస్తుండటంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో 13వ తేదీన మేనత్తకు ఒంట్లో బాగోలేకపోవడంతో కుటుంబ సభ్యులందరూ కలిసి చూడటానికి వెళ్లారు. సాయంత్రం ఎదురింట్లో ఉండే వాళ్లు అరుణ్‌కుమార్ అన్న సత్యనారాయణకు ఫోన్ చేసి మీ తమ్ముడు ఎలుకల మందు తిన్నాడని చెప్పారు. దీంతో అరుణ్‌కుమార్‌ను ఇంటి దగ్గరలో ఉన్న ఆర్ఎంపీ వద్దకు తీసుకువెళ్లే సరికి గవర్నమెంట్ ఆస్పత్రికి తీసుకువెళ్లమని చెప్పడంతో వారు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అరుణ్‌కుమార్ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై అరుణ్‌కుమార్ అన్న సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### నిండు గర్భిణి అనుమానాస్పద మృతి

**గుణదల(విజయవాడ తూర్పు):** నిండు గర్భిణి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బందరు రోడ్డు సమీపంలోని ఇజ్రాయేల్ పేటకు చెందిన రామకృష్ణ, దావులూరి శిరీష(38) దంపతులు. రామకృష్ణ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. శిరీష ఇంటి వద్దే ఉంటుంది. ప్రస్తుతం ఆమె ఎనిమిదో నెల గర్భవతిగా ఉంది. ఈ నెల 14వ తేదీన సాయంత్రం సుమారు 4.30 గంటలకు డ్యూటీ దిగి ఇంటికి చేరుకున్నాడు. శిరీషను ఆసుపత్రికి తీసుకు వెళ్లాల్సి ఉండగా.. డబ్బులు కోసం రాత్రి 7 గంటల సమయంలో ఆర్టీసీ డిపోకు వెళ్లాడు. అటుపై 8 గంటల సమయంలో ఇంట్లోనే ఉన్న శిరీష కళ్లు తిరిగి కింద పడిపోయింది. ఇది గమనించిన చుట్టు పక్కల స్థానికులు ఆమెను గుణదలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యం అందిస్తున్న సమయంలో శిరీష రాత్రి 9 గంటల సమయంలో అపస్మారక స్థితిలోకి వెళ్లి కొద్ది సేపటికి మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. విషయం తెలిసిన భర్త, మృతురాలి కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. మరో నెలలో ఆమెకు కాన్పు ఉన్న నేపథ్యంలో ఇలా మృతి చెందడం పట్ల కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎటువంటి అనారోగ్య కారణాలు లేకుండా అకస్మాత్తుగా శిరీష చనిపోవడం పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి అక్క మేరీ సుధా జరిగిన సంఘటన పట్ల మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసు పరిశీలిస్తామని పోలీసులు చెబుతున్నారు.

## ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్

**మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):** ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు విద్యార్థులంతా ఐక్యంగా ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ చెప్పారు. స్థానిక సున్నపు బట్టీల సెంటర్ సమీపంలోని రామనరసయ్య భవన్‌లో పీడీఎస్‌యూ ఎన్టీఆర్ జిల్లా మహాసభల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. వినోద్ కుమార్ హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం విధ్వంసం అవుతోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో అమలు చేస్తున్న విధానాలు విద్యారంగాన్ని తీవ్రంగా నష్ట పరుస్తున్నారని చెప్పారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న పీడీఎస్‌యూ ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

## ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు శిక్షణ

**పటమట(విజయవాడతూర్పు):** పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులపై వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎన్టీఆర్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి ఏ.శ్రావణ్ బాబు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపంతో ఉన్న చిన్నారులను ఆరు నెలల నుంచి 59 నెలల వరకు గుర్తించేందుకు కమ్యూనిటీ స్థాయిలో 10 కీలక నియమాలను ఆచరించాల్సి ఉందని అన్నారు. కమ్యూనిటీలోనే కాకుండా అంగన్‌వాడీ కార్యకర్త సహకారంతో క్షేత్రస్థాయిలో సందర్శనలు చేయాలని, పోషకార లోపంతో ఉన్న బిడ్డలను సాధారణ స్థితికి వచ్చేంత వరకు పర్యవేక్షించడం ముఖ్యమన్నారు.

**పోస్టర్ ఆవిష్కరణ..**

విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి టి. రంగారావు మాట్లాడుతూ తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్న వారికి టాటా ట్రస్ట్ సహకారంతో బాలామృతం ప్లస్ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కమ్యూనిటీ బేస్డ్ ఆధారిత పోషకార లోపల నిర్వహణ, 10 కీలక అంశాలు అనే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం. శరత్ బాబు, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి జి. రేణుక, ట్రైనర్ ప్రోగ్రాం అసోసియేట్ కిన్నెర పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు

## బైక్ చోరీ తీగకు దొరికిన గంజాయి డొంక

పది మంది అరెస్టు

**ఉయ్యూరు:** బైక్ చోరీ కేసులో పోలీసులు తీగ లాగితే గంజాయి డొంక కదిలింది. దీంతో గంజాయి ముఠాను మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల మేరకు.. మోటారు సైకిల్ చోరీ కేసులో నిందితుడు షేక్ ఖలీల్ అలియాస్ కాళీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణ క్రమంలో నిందితుడు అందించిన సమాచారంతో గంజాయి ముఠాగుట్టు వెలుగుచూసింది. గంజాయి ముఠాను పట్టుకునేందుకు సీఐ రామారావు, ఎస్ఐ మల్లికాసులు, ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దాడులు చేశారు. దాడుల్లో కలిషాతోపాటుగా రాయపూడి దీపక్ అలియాస్ బన్ను, అబ్దుల్ బషీద్, బుర్రా విజయ్, రత్నం సాయి సందీప్, షేక్ సుబానీ, మహ్మద్ ఇబ్రహీం, మహ్మద్ రెహమాన్, కోలంటి జాన్, సందేష్ పాల్, మురారి పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కిలోలు గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. వీరిని ఉయ్యూరులో కోర్టులో హాజరుపరచగా.. జడ్జి ఆదేశాల మేరకు నెల్లూరు జైలుకు తరలించినట్లు సీఐ చెప్పారు.

**తెలంగాణకు ప్రత్యేక బృందం..**

ఉయ్యూరుకు గంజాయి సరఫరా తెలంగాణకు చెందిన ఓ ప్రధాన వ్యక్తి నుంచి జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయిని ఉయ్యూరు ముఠాకు తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు అసలు నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు ఓ బృందం తెలంగాణకు వెళ్లింది. ఏజెన్సీ నుంచి ఉయ్యూరుకు గంజాయి చేరుతున్న తీరును క్షుణ్ణంగా పరిశీలించి, గంజాయిని నిరోధించేందుకు అన్ని విధాలా చర్యలు చేపడుతున్నారు.




వివరాలు వెల్లడిస్తున్న సీఐ టీవీవీ రామారావు

## బస్సులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



**గన్నవరం:** ట్రావెల్స్ బస్సులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గన్నవరం సబ్ డివిజన్ డీఎస్పీ కె. ధర్మేంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని అరెస్ట్ చూపించారు. పల్నాడు జిల్లా కారంపూడి గ్రామానికి చెందిన కుంచపు సురేష్ అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం మేరకు ఈ నెల 12వ తేదీ రాత్రి ఈగల్ టీమ్, గన్నవరం పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ సోదాల్లో ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న సురేష్‌ను అదుపులోకి తీసుకుని 15 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదరు గంజాయిని ఒడిశాకు చెందిన వెంకట్ అనే వ్యక్తి ద్వారా కేజీ రూ. 5వేలు చొప్పున సురేష్ కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్నట్లు వివరించారు. సురేష్‌పై గతంలో విశాఖపట్నంలో రెండు గంజాయి కేసులు ఉన్నట్లు తెలిపారు. కంచరపాలెం పీఎస్‌లో నమోదైన కేసులో అరెస్టయిన సురేష్ గత జూన్‌లో షరతులతో కూడిన బెయిల్‌పై విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలైనట్లు చెప్పారు. ఇప్పటి వరకు గన్నవరం పీఎస్ పరిధిలో గంజాయి 140 కేజీలు, గన్నవరం సబ్ డివిజన్ పరిధిలో 632 కేజీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ బీవీ శివప్రసాద్, ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

## పలు ప్రత్యేక రైళ్లు పొడిగింపు

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** రానున్న దసరా, దీపావళి, ఛత్ పండుగలతో పాటు చలికాలంలో పెరగనున్న అదనపు ప్రయాణికుల రద్దీని నివారించేందుకు ఇప్పటికే నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లను పొడిగించి నడపనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పొడిగించిన రైళ్ల వివరాలు..

- విశాఖపట్నం-ఎస్ఎంవీటీ బెంగళూరు (08581) అక్టోబర్ 2 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి శుక్రవారం, ఎస్ఎంవీటీ బెంగళూరు-విశాఖపట్నం (08582) అక్టోబర్ 3 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శనివారం, షాలీమార్-చర్లపల్లి (08045) అక్టోబర్ 2 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి శుక్రవారం, చర్లపల్లి-షాలీమార్ (08046) అక్టోబర్ 3 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శనివారం, సికింద్రాబాద్ - నహర్లగన్ (07046) అక్టోబర్ 2 నుంచి 30 వరకు ప్రతి శుక్రవారం, నహర్లగన్-సికింద్రాబాద్ (07047) అక్టోబర్ 5 నుంచి నవంబర్ 2 వరకు ప్రతి సోమవారం నడవనున్నాయి.
- హైదరాబాద్-కొల్లం (07193) అక్టోబర్ 3 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శనివారం, కొల్లం-హైదరాబాద్ (07194) అక్టోబర్ 5 నుంచి నవంబర్ 30 వరకు ప్రతి సోమవారం, సికింద్రాబాద్-శ్రీకాకుళం రోడ్డు (07425) అక్టోబర్ 4 నుంచి నవంబర్ 29 వరకు ప్రతి ఆదివారం, శ్రీకాకుళం రోడ్డు-సికింద్రాబాద్ (07426) అక్టోబర్ 5 నుంచి నవంబర్ 30 వరకు ప్రతి సోమవారం, చర్లపల్లి-తిరువణ్ణమలై (07001) అక్టోబర్ 1 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి గురువారం, తిరువణ్ణమలై-చర్లపల్లి (07002) అక్టోబర్ 2 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి శుక్రవారం కొనసాగనున్నాయి.
- జాల్నా-తిరుపతి (07814) అక్టోబర్ 1 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి గురువారం, తిరుపతి-జాల్నా (07815) అక్టోబర్ 2 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి శుక్రవారం, నాందేడ్-తిరుచానూర్ (07603) అక్టోబర్ 6 నుంచి నవంబర్ 24 వరకు ప్రతి మంగళవారం, తిరుచానూర్-నాందేడ్ (07604) అక్టోబర్ 7 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి బుధవారం నడవన్నాయి.

## గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

**జి.కొండూరు:** మండలంలోని కవులూరు గ్రామ శివారు బుడమేరు డైవర్షన్ కెనాల్‌లో సోమవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం(సుమారు 55ఏళ్లు) ఉన్నట్లు గుర్తించిన స్థానిక రైతు డయల్ 100కి ఫోన్ చేసి చెప్పారు. జి.కొండూరు ఎస్ఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి సదరు మృతదేహాన్ని వెలికి తీయించారు. పంచనామా, ఇంక్వెస్ట్ నిర్వహించి పోస్టమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టిసీమ నీటి ప్రవాహంలో మృతదేహం కొట్టుకొచ్చినట్లు పోలీసులు భావిస్తున్నారు. లభ్యమైన మృతదేహం పురుషుడిది అని తలపై కొంతభాగం బట్టతల ఉండి, నలుపు, నీలం రంగు టీ షర్ట్, కాఫీ రంగు లోదుస్తులు ధరించినట్లు పోలీసులు తెలిపారు.

**గుణదలలో..**

**గుణదల(విజయవాడ తూర్పు):** గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు మంగళవారం మృతి చెందాడు. మాచవరం ఎస్ఐ యోగేష్ తెలిపిన వివరాల ప్రకారం, పుణ్యక్షేత్ర ప్రధానాలయం గేటు వద్ద ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన భక్తులు 108కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది ఆ వృద్ధుడిని పరీక్షించగా అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మాచవరం పోలీసులు వివరాలు సేకరించి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కాగా వృద్ధుడి వయసు 70 ఏళ్లు ఉంటుందని, ఇతని ఆచూకీ తెలిసిన వారు తమకు తెలియజేయాలని కోరారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, 3వ అంతస్తు, కెఫ్‌సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :0866-2546922

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ షాహెన్షా హుస్సేన్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 99891 79786, వాహనము తనిఖీ కొరకు : 96401 64119

**ఇ-వేలం ద్వారా వాహనములు అమ్మకం (హైపోథికేషన్)**

ఈ దిగువ ఉదహరించిన ఋణగ్రహీత వాహనముల కొనుగోలు కొరకు ఋణసౌకర్యము వినియోగించుకున్నారు. ఋణగ్రహీత ఋణము యొక్క వాయిదాలు చెల్లించుటలో విఫలమైనారు. కావున బ్యాంకు వారిచే సదరు వాహనములు జప్తు చేయబడి ఆన్‌లైన్ వేలం ద్వారా వేలం వేయుటకు ఈ దిగువ తేదీన నిర్ణయించటమైనది.

యూనిట్/ఋణగ్రహీత పేరు : మెస్సర్స్ Aryahi Infra, మేనేజింగ్ పార్టనర్: శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి: సురేష్, డోర్ నెం.11-568, కంచికచర్ల, ఎన్‌టిఆర్ జిల్లా-521180. పార్టనర్: శ్రీమతి చుక్కపల్లి శ్రావణి, భర్త: నితిన్ చక్రవర్తి, డోర్ నెం.11-568, కంచికచర్ల, ఎన్‌టిఆర్ జిల్లా-521180. వేరొక చిరునామా: శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి: సురేష్, ఫ్లాట్ నెం.4, శర్మ అపార్ట్‌మెంట్స్, మెథడిస్ట్ కాలనీ, బేగంపేట, హైదరాబాద్, తెలంగాణ-500016. 2) శ్రీమతి చుక్కపల్లి శ్రావణి, భర్త: నితిన్ చక్రవర్తి, ఫ్లాట్ నెం.4, శర్మ అపార్ట్‌మెంట్స్, మెథడిస్ట్ కాలనీ, బేగంపేట, హైదరాబాద్, తెలంగాణ-500016.

| వ.సం. | రిజిస్ట్రేషన్ నెం. | కంపెనీ / ఫ్యూయల్ / కలర్ | మోడల్ | రిజర్వు ధర | ధరావత్తు |
|---|---|---|---|---|---|
| 1 | AP 39 VB 5099 | TATA PRIMA2830. TK BSIV SR 16BX-HEAVY LOAD TIPPER, COLOUR - SPEED BLUE; | 2023 | Rs.25,00,000/- | Rs. 2,50,000/- |
| 2 | AP 39 VB 6099 | TATA PRIMA2830. TK BSIV SR 16BX -HEAVY LOAD TIPPER COLOUR - SPEED BLUE; | 2023 | Rs.25,00,000/- | Rs. 2,50,000/- |
| 3 | AP 39 VB 7099 | TATA PRIMA2830. TK BSIV SR 16BX - HEAVY LOAD TIPPER COLOUR - SPEED BLUE; | 2023 | Rs.25,00,000/- | Rs. 2,50,000/- |

వాహనములు తనిఖీ చేయు ప్రదేశం: వెంకట్ స్టాక్ యార్డు, ప్రసాదంపాడు, విజయవాడ

ఇ-వేలం తేది మరియు సమయం : 05-10-2026 ఉ॥ 11.00 గం॥ల నుండి మ॥ 01.00 గం॥ల వరకు వేలం పూర్తయ్యే వరకు ప్రతి బిడ్‌కు 5 ని॥ల అపరిమిత పొడిగింపు కలదు

బిడ్స్ సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 05-10-2026 సా॥ 04.00 గం॥లకు

బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ.10,000/-లతో గుణింపులో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) వాహనములను "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడవు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) విజేత బిడ్డరు పేరుపై వాహనములు బదిలీ చేయుటకు సంబంధించి సంబంధిత అన్ని ఖర్చులు విజేత బిడ్డరు మాత్రమే భరించవలెను. తేది: 16-09-2026 నుండి తేదీ: 04-10-2026 వరకు బ్యాంకు పనివేళల యందు వాహనములు తనిఖీ చేసుకొనవచ్చును. 5) ట్యాక్స్ నిబంధనల ప్రకారం జిఎస్‌టి & టిసిఎస్ & ఇతర ఛార్జీలు వర్తిస్తాయి. 6) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 7) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్ సైట్: www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance యొక్క వెబ్‌పోర్టల్: https://baanknet.com/eauction-psb/bidder-registration, టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 8291220220ను సంప్రదించండి.

గమనిక : ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం ముగిసేలోపు PSB Alliance నందు ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి (Pre-Bid EMD) జమ చేయవలెను. ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డి మొత్తం PSB Alliance బ్యాంక్ అకౌంట్‌లో జమ అయిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపరిచిన తరువాత మాత్రమే బిడ్డరు యొక్క "వాలెట్"లో చూపించబడుతుంది. బ్యాంకింగ్ ప్రక్రియలో ఇది జరుగుటకు సమయం పట్టవచ్చు, కావున బిడ్డర్లు చివరి నిముషంలో ఇబ్బందులు ఎదుర్కొనకుండా తమ ప్రీ-బిడ్ ఇ.ఎమ్.డిను సాధ్యమైనంత త్వరగా జమ చేసుకోవాలని సూచించటమైనది.

తేది : 15-09-2026, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, SBI, SARB, విజయవాడ

సాక్షి క్లాసిఫైడ్స్

**Education**

■ శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 Certified. APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc, M.Com, MBA, MCA ✆ 99493 08940 [B-779870]

■ 10th & ఇంటర్ ఫెయిల్ అయ్యారా! అక్టోబర్‌లో ఎగ్జామ్‌లో పాస్ అవ్వండి ఆంధ్రా, నాగార్జున యూనివర్శిటీల ద్వారా Degree, PG, MBA, MCA, భవ్య అకాడమీ, (Since: 2001). ✆ 99486 65678 [B-65]

**Wanted**

■ విజయవాడ సిటీలో పనిచేయుటకు లేడిస్/ జంట్స్ సె॥ గార్డ్స్ కావలెను. వ:25 – 35 yrs, చదువు :ఇంటర్, జీతం:17-18 వేలు.9440229592, 92464 00592 [B-338]

■ Wanted Female Experienced School Incharge, Sports Teacher, Primary Subjects & Experienced Evening Study Hour Teachers and Computer Receptionist. Cont: Payakapuram, Vijayawada. ✆ 9100910026, 8309122705 [B-1321904]

■ ఇండియన్ పెస్ట్ కంట్రోల్ కంపెనీ నందు పనిచేయుటకు వర్కర్లు కావలెను. పురుషులకు మాత్రమే. BRTS Road, విజయవాడ. ✆ 99665 44312. [B-336]

■ విజయవాడలో Eeco & Omni అంబులెన్స్‌లు నడుపుటకు అనుభవం గల డ్రైవర్లు కావలెను. సంప్రదించండి. ✆ 9297 108 108 [B-803442]

■ వర్కర్స్ కావలెను.రిసార్ట్ లో మరియు వ్యవసాయం పనులు చేయుటకు రూమ్ ఇవ్వబడును. వరంగల్.. తెలంగాణ ఫోన్ 9440170440. [SCA26014017]

■ VJA లో సె॥గార్డ్స్, అపార్ట్‌మెంట్స్, గోడౌన్స్, షాపింగ్‌మాల్స్, కాలేజీలో రిసెప్షనిస్ట్ M/F, Q: 10th పైన వ: 45 Exp. వారు సంప్ర ✆ 99513 87899 [G-484]

**Real Estate**

HOUSE FOR SALE

■ విజయవాడ కంకిపాడు-పునాదిపాడు శ్రీసిటీ లెజెండ్ ప్రక్కన తూర్పు ఫేస్, 168 చ.గ. లలో ఇండిపెండెంట్ బిల్డింగ్స్ గృహప్రవేశనము నకు సిద్ధంగా కలవు. ✆ 96188 96669, 94417 15911 [B-1320723]

PLOT FOR SALE

■ హైవే ఫేస్ కమర్షియల్ ప్లాట్స్ అమ్మకం తాడేపల్లి / కొలనుకొండ సర్వీస్ రోడ్ ఫేస్ 920 చ॥గ॥ కియా షోరూం ప్రక్కన / ఇస్కాన్ టెంపుల్ ఎదురు CRDA బిల్డింగ్ పర్మిషన్ కలవు. ✆ 99662 28370 [B-307]

**Services**

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్ లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకికాల్‌చేయండి. ✆ 7406393937 [HA-611]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్). ✆ 81422 92071 [B-310]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ | సాక్షి దినపత్రికలో ప్రకటనలకై మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి | ఎన్టీఆర్ జిల్లా : 79955 54534, విజయవాడ సిటీ : 99122 20539, కృష్ణాజిల్లా : 99122 20347 | 9010210386 | 9010201611 | 9505507329 | ఉయ్యూరు, కంకిపాడు 9010577706 | గన్నవరం 9010210382 | రూ.600/- | రూ.125/- | ఉచితం